వెంటనే ఆ అమెరికన్ సాధకుడు ఆ యోగికి సాష్టాంగ నమస్కారం చేసి తన తలని ఆయన పాదద్వయం మీద వుంచాడు.

## 42. నేను

రోడ్డు పక్క చెత్తడబ్బాకి ఆనుకుని కూర్చున్న అర్ధనగ్నంగా వున్న ఓ జ్ఞానితో తగూ పడ్డాడో అజ్ఞాని.

"నేనెవరో నీకు తెలుసా?"గర్జించాడు అజ్ఞాని.

చిన్నగా నవ్వి ప్రేమగా చూస్తూ అడిగాడు జ్ఞాని.

"ఆ 'నేను' ఎవరు బాబు? నీ పదవా? నీ ఆస్తా? నీ మనుషులా? నీ పరపతా? నీ విద్యా? లేక ఇంకేమైనానా? వాటిని మనసులో పెట్టుకునేనా నువు 'నేనెవరో నీకు తెలుసా?' అని నన్ను అడుగుతున్నావు? ఇలా ఎన్నో బయటి వాటిమీద స్వతంత్రం లేని ఆ 'నేను' ఆధారపడి వుంది. అవి దూరమైతే అప్పుడా నేను ఎంతో బలహీనమయి పోతుంది అని నువ్వు ఎన్నడూ ఆలోచించలేదా? కనీసం తనకి తానుగా నిలబడలేని ఆ 'నేను'ని చూసి ఎందుకు అలా మిడిసి పడుతున్నావు? ఆ నేనుని నువ్వు నాశనం చెయ్యి. అప్పుడు ఎన్నటికీ నాశనం కాని, ఇంతదాకా కలలో కూడా నీకు పరిచయం కాని సహజమైన ఆ 'అసలు నేను' నీ స్వంతమవుతుంది. అప్పుడు నీకు పరాయివాళ్ళ మీద ఇలా కోపం రమ్మన్నా రాదు. ఆనందం పొమ్మన్నా పోదు. అనేకంచేత నిర్మితమైన, నువ్వు పట్టుకుని వేలాడే ఆ 'నేను' ఎందుకూ కొరగానిదని అర్ధం చేసుకో."

అజ్ఞానికి తన అజ్ఞానం కొంత అర్ధమైంది.

## 43. నిశ్శబ్ద బోధ

ఓ హరిదాసు నిత్యం నిర్వహించే హరిభజనకి ఓ భక్తుడు అకస్మాత్తుగా రావడం మానేసాడు. అది గమనించిన హరిదాసు కొద్ది రోజులు వేచి చూసి తర్వాత ఆ భక్తుడి ఇంటికి వెళ్ళాడు. ఆ భక్తుడు హరిదాసుని సాదరంగా

ఆహ్వానించి చలి కాచుకునే కుంపటి దగ్గర కూర్చోపెట్టాడు. భజనలకి రాకపోవడానికి కారణం అడిగితే చెప్పాడు అతను.

"వీటి వల్ల పెద్దగా ప్రయోజనం వుంటుందని నాకనిపించడం లేదు."

హరిదాసు ఏం మాట్లాడకుండా కుంపటిలోంచి కణ కణ మండే ఓ బొగ్గుని బయటకి తీసి ఇవతల వుంచాడు. తర్వాత చేతులు చాపి చలి కాచుకున్నాడు. కొద్దిసేపట్లో ఆ నిప్పు కణికకున్న నిప్పు ఆరిపోయింది. హరిదాసు ఆ బొగ్గుని మళ్ళీ తీసి కుంపటిలో వేసాడు. వెంటనే నిప్పు కణికల మధ్యకి చేరిన ఆ బొగ్గు అంటుకుని మండసాగింది. ఆ హరిదాసు లేచి వెళ్ళిపోయాడు.

మర్నాటి నించి భజనలకి వెళ్ళడం మానేసినతను తిరిగి హరి భజనకి వెళ్ళసాగాడు.

## 44. పోలిక

నిత్యం రామభజన చేస్తున్న వాళ్ళని చూసి కర్మ మార్గంలో వున్న ఒకతను ఓ రోజు ఎకసెక్కంగా అడిగాడు.

"రామ రామ అని అనేకసార్లు పలుకగానే రాముడు ప్రత్యక్షం అవుతే, 'చక్కెర చక్కెర' అని భజన చేస్తే మరి నోరు తీపి అవాలి కదా? కాని అలా జరగడం లేదు. మరి ఎందుకీ ధ్వని కాలుష్యం?"

"సర్వ భూతాలకి ఆధారమైన ఆ రామచంద్రుడ్ని, మనుష్యులు చేసిన ఓ వస్తువుతో పోల్చావంటే దేవుడు మీద నీకు గల నమ్మకం ఎలాంటిదో అర్థమైంది." బదులు చెప్పారు భక్తి మార్గంలో భజన చేసేవాళ్ళు.

## 45. రెండు రెక్కలు

ఒకసారి అగస్త్య మహర్షిని ఆయన శిష్యుడైన సుతీక్షణుడు తన అనుమానాన్ని తీర్చమని ఇలా అడిగాడు.